కథ

# కనువిప్పు

- మాధవపెద్ది ఉష

కాలింగ్ బెల్ మోతకి తలుపు తీసిన శాంత ఎదురుగా వర్థనమ్మ గారిని చూడగానే రండి రండి పిన్నిగారూ అంటూ లోపలికి ఆహ్వానించింది. వర్థనమ్మ గారి భర్త జనార్థనరావు గారూ శాంత భర్త ప్రభాకర్ ఒకే ఆఫీసులో పని చేస్తున్నారు. వయస్సులో తనకన్నా పెద్ద అవటం చేత శాంత వర్థనమ్మగారిని పిన్నిగారూ అనటం అలవాటు. ఆ ఇద్దరి కుటుంబాల మధ్య మంచి స్నేహమే ఉంది.

"ఈ రోజు నువ్వు సెలవు పెట్టావని మన పనిమనిషి బాలమ్మ చెప్పిందమ్మాయి. అందుకే కాస్త కాలక్షేపంగా ఉంటుందని ఇలా వచ్చాను" అంటూ శాంత చూపించిన సోఫాలో కూర్చున్నారు వర్థనమ్మ గారు.

"అవునండీ పిన్నిగారూ. పోయిన వారమంతా ఆఫీసులో హెవీ వర్క్ ఉండటంతో ఆదివారం కూడా పని చేయవలసి వచ్చింది. అందుకే కాస్త మైండ్‌కి, బాడీకి రెస్టు ఇవ్వాలని సెలవు పెట్టాను. ఇంక చెప్పండి ఏమిటి విశేషాలు? మీ ఆరోగ్యం ఎలా ఉంటున్నది? మీ శరత్‌కి ఏమయినా సంబంధాలు చూస్తున్నారా?" అంటూ కుశల ప్రశ్నలు వేస్తూ ఆవిడతో పిచ్చాపాటి ఖబుర్లలో పడింది శాంత. మధ్యలో ఇప్పుడే వస్తాను అంటూ ఒకసారి లోపలికి వెళ్ళి వచ్చింది.

వాళ్ళిద్దరూ మళ్ళా ఖబుర్లలో పడ్డారు. ఇంతలో ఒక పదహారేళ్ళ అమ్మాయి ట్రేలో టీ బిస్కెట్‌లు పెట్టుకుని వచ్చి టీపాయి మీద అవన్నీ పెట్టేసి వెళ్ళిపోయింది.

ఆ పిల్లని చూసిన వర్థనమ్మ గారు భృకుటి ముడివడింది. ఎవరూ ఆ పిల్ల అని అడిగారు శాంతని ఆరాగా.

దానికి శాంత "నేనే కుదిర్చాను. ఎంత పాచి పనికి పనిమనిషి ఉన్నా ఇంట్లో పై పనీ వంటపనీ ఉద్యోగం అన్నీ చేసుకోలేకపోతున్నాను పిన్నిగారూ! అందుకే మన ఆనందరావు గారి మిసెస్‌ని అడిగాను ఎవరైనా పనిపిల్ల ఉంటే చూడమని. ఆవిడే చూసిపెట్టారు. ఈ పిల్ల పేరు సుజాత. నా అనేవాళ్ళు లేరు. అందుకే



మా ఇంట్లోనే ఉండేటట్లు ఏర్పాటు చేసుకున్నాము. మా పిల్లలతో పాటే ఉంటుంది. ఇంకొక్క మనిషి మాకు బరువు కాదు. పనీ అదీ చక్కగా చేస్తుంది. పైగా వంట కూడా బాగా చేస్తుంది. సుజాత వచ్చినప్పటి నుంచీ నాకు వంట టెన్షన్ తప్పిందంటే నమ్మండి పిన్నిగారూ" అంటూ చెప్పుకుపోతున్న శాంత వాక్ప్రవాహానికి ఆనకట్ట వేస్తూ అడిగారు వర్థనమ్మ గారు.

"ఆ పిల్ల కులం గోత్రం అదీ చూసే పెట్టుకున్నారా? ఏ పాచి పనికో అయితే ఫరవాలేదు కానీ ఏకంగా వంటకే...!"

"మనవాళ్ళు కాదనుకోండి. అయినా ఈ కాలంలో కూడా ఏమిటండీ పిన్నిగారూ కులం గోత్రం అంటూ.... మీది మరీ ఛాదస్తం గాకపోతేను. మనుష్యులు పరిశుభ్రంగా ఉండటం ముఖ్యం కానీ ఏ కులం అయితే ఏముందండీ" అంది శాంత.

కానీ ఆమె చెప్పింది వర్థనమ్మ గారికి రుచించలేదని ఆవిడ ముఖకవళికలు చెప్పక చెప్తున్నాయి.

"ఏమోనమ్మా శుద్ధ శ్రోత్రీయ వంశంలో పుట్టి ఇలా కులం తక్కువ పిల్ల చేత వంట చేయించుకుని తినటం నేను ఎంతమాత్రం హర్షించలేకుండా ఉన్నాను. నీకు అంతగా కావాలంటే మా కమలమ్మగార్నే మీకు పంపేదాన్ని కదా. ఆవిడకి కుదరకపోతే ఇంకెవరినన్నా చూసి పెట్టమన్నా పెట్టుంది. అంతే కానీ ఈ ఖర్మేంటండి?"

కమలమ్మ గారి పేరు వినగానే శాంతకి ఒంటినిండా తేళ్ళూ జెర్రులు పాకినట్లయింది. ఆవిడది మన కులమే కదా అని ఈమధ్యనే వంటకి కుదిర్చింది వర్థనమ్మగారు ఆవిడ ఆరోగ్యం అంతగా బావుండని కారణంగా. ఆవిడ పేరు చెప్పగానే శాంతకి ఆరోజు వర్థనమ్మ గారింటికి వెళ్ళినప్పుడు ఆవిడని వంట ఇంట్లో పని చేస్తుండగా చూడటం జ్ఞాపకం వచ్చింది. ఆరోజు తను వెళ్ళినప్పుడు వర్థనమ్మ గారు స్నానం చేస్తున్నారు. అందుకని దాహం వేస్తుంటే మంచినీళ్ళు తీసుకుని త్రాగుదామని తనే వంట ఇంట్లోకి వెళ్ళింది. అప్పుడు కమలమ్మ గారు ఫ్రిజ్ లోంచి పెరుగు తీసి పై మీగడని చేత్తో తీసి వేరే గిన్నెలో పెట్టటం తన కళ్ళపడింది. పైగా ఆవిడ చేతి గోళ్ళు బాగా పెరిగిపోయి వాటి నిండా మట్టి. ఆవిడ ఆ చేత్తోనే పెరుగు మీద మీగడ తీయటం తనకి ఒళ్ళంతా కంపరంగా అనిపించింది.

పోనీ వంట ఇంట్లో గరిటలు లేవా అంటే గరిటల స్టాండు నిండా గరిటలే. అయినా ఆవిడ చేత్తో తీసిందంటే కేవలం ఆవిడ పెరిగిన వాతావరణం చిన్నప్పటి నుంచి అబ్బిన అలవాట్లే కారణం. పైగా మడీ తడీ అంటూ ఆచారాలు పాటిస్తుం దావిడ. కనీస శుభ్రతయినా పాటించ కుండా ఎందుకీ లేనిపోని ఆచారాలు.... ఇలా సాగిపోతున్న ఆలోచనలకి స్వస్తి చెప్పి వర్ధనమ్మ గారికి టీ అందించింది శాంత.

కానీ వర్ధనమ్మగారు తీసుకోవటానికి నిరాకరించారు. "వద్దమ్మా చూస్తూ చూస్తూ ఆ అమ్మాయి చేతి టీ తాగమంటావా. ఇంకా నయం" అని దీర్ఘం తీసారు. శాం తకి నిజంగా ఒళ్ళు మండింది.

"అదేంటండీ పిన్నిగారూ. మనం హెూటళ్ళకి వెళ్ళినప్పుడు ఎవరి చేతి వంటో తినటం లేదా. ఆ చేసేవాడి కులం ఎమిటో కనుక్కునే తింటున్నామా" కొద్దిగా పరుషంగానే ధ్వనించింది శాంత గొంతు. దానికి వర్ధనమ్మ గారు ఇచ్చిన జవాబు :

"నీకు తెలుసో లేదో అమ్మాయి. నేను హెూటల్ కూడు అసలు ముట్టను. ఏ ఊళ్ళకెళ్ళినా అయినవాళ్ళింట్లో అప్పటి కప్పుడు వండించుకుని తింటానే కానీ హెూటల్ భోజనం చేయాల్సిన అగత్యం నాకు ఇంతవరకూ కలగలేదు. ఏ కారణం చేతనయినా కుదరకపోతే ఏ పండో కాయో తిని కాలక్షేపం చేస్తానే కానీ హెూటళ్ళ జోలికి ఛస్తే పోను."

"ఒకప్పుడు ఆ ఏ పండో కాయో కూడా దొరకదు. అప్పుడు ఏం చేస్తారు."

"అప్పుడు పస్తు పడుకుంటాను" అన్నారు వర్ధనమ్మ గారు మొండిగా. ఇక ఆవిడతో వాదించి లాభం లేదని ఆ విష యం అక్కడితో వదిలేసింది శాంత. ఇది సమయం వచ్చినప్పుడు ఎవరంత వారు తెలుసుకోవాల్సిన విషయమే కానీ ఒకరు చెప్తే గ్రహించేది కాదని ఆమెకు తెలుసు.

* * *

ఒక నెల రోజుల అనంతరం...

ఆరోజు ఆదివారం. శాంత భర్త ప్రభాకర్, శాంత పిల్లలూ మధ్యాహ్నం నిద్ర, ముగిసాక సుజాత ఇచ్చిన కాఫీ టిఫిన్‌లు సేవించి తీరిగ్గా టి.వి.లో ఏదో సినిమా చూస్తున్నారు.

అంతలోనే ఫోన్ రింగయింది. ఎవ రయి ఉంటారబ్బా అనుకుంటూ తనే లేచి రిసీవరందుకుంది శాంత. అవతలి నుండి వర్ధనమ్మ గారి అబ్బాయి శరత్ కంఠం వినిపించింది.

అతని కంఠంలోని ఆదుర్దాని గమ నించి శాంత అడిగింది. "ఏమిటి శరత్ ఏమిటి అంత ఖంగారుగా ఉన్నావు. ఏమైంది?"

అవతలి వ్యక్తి చెప్పిన మాటలు విన గానే శాంత ముఖంలో రంగులు త్వర త్వరగా మారిపోయాయి.

"ఆహ్ అలాగా ఎప్పుడు జరిగింది? ఇప్పుడు ఎట్లా ఉన్నారు? ఎక్కడా అను రాధా నర్సింగ్ హెూమ్‌లోనా... సరే అలాగే మేము ఇప్పుడే బయలుదేరి వస్తున్నాము. ఏమీ గాబరాపడకండి. డాక్టర్లు ఉన్నారు మందులు న్నాయి. తగ్గిపోతుంది. ధైర్యంగా ఉండండి" అని ఫోను పెట్టేసి భర్త వంక చూసి చెప్పింది శాంత.

"మన జనార్ధనరావు బాబాయిగారినీ, వర్ధనమ్మ పిన్నిగారినీ మధ్యాహ్నం రెండు



గం॥కి వామిటింగ్స్, మోషన్సు అవుతుంటే హాస్పిటల్‌లో చేర్పించారుట. డాక్టర్లు ఫుడ్ పాయిజనింగ్ అయిందని చెప్పారుట. సమయానికి శరత్ కూడా ఇంట్లో లేడట. వాళ్ళ పక్కింటి చక్రవర్తి గారే వాళ్ళని అంబులెన్స్ తెప్పించి నర్సింగ్‌హెూమ్‌లో చేర్పించారుట. సెలయిన్ ఎక్కిస్తున్నా రుట. వాంతులు, విరేచనాలు కంట్రోల్ అవుతున్నాయిట. మనం వెంటనే వెళ్ళా లండీ" గబగబా చెప్పింది శాంత

శరత్ నర్సింగ్ హెూమ్ బయటే ఎదురయ్యాడు. అంతా కలిసి స్పెషల్ రూమ్‌లో అడుగుపెట్టారు. జనార్ధనం గారు ఒక బెడ్ మీద వర్ధనమ్మ గారు మరొక బెడ్‌మీద పడుకుని ఉన్నారు నిస్సహాయంగా. వాళ్ళ మొహాలు పీక్కు పోయి ఉన్నాయి. ఇద్దరికీ సెలయిన్ ఎక్కిస్తున్నారు.

ప్రభాకర్, జనార్ధనం గారి తలవైపు ఉన్న స్టూల్ మీద కూర్చుంటూ ఎంతో ఆందోళనగా అడిగాడు.

"ఇదంతా ఎలా జరిగిందండీ అసలు? ఏం తిన్నారు మీరు ఫుడ్ పాయిజనింగ్ అవటానికి?"

"మధ్యాహ్నం తోటకూర పులుసు, బంగాళా దుంపల వేపుడు చేసిందోయ్ మా కమలమ్మ గారు. మన శరత్ ఈరోజు వాళ్ళ ఫ్రెండ్ ఇంటికి లంచ్‌కి వెళ్ళడంతో సేవ్ అయ్యాడు. లేకపోతే వాడు కూడా అడ్డం పడి ఉండేవాడు" అన్నారు జనా ర్ధనంగారు నీరసంగా. ఇంతలో డ్యూటీ డాక్టరు వచ్చాడు. ఇద్దరినీ చెక్ చేసి "ఫరవాలేదు. దే ఆర్ అవుట్ ఆఫ్ డేంజర్ నౌ" అని వర్ధనమ్మగారి నుద్దేశించి,

"ఆకు కూరలని శుభ్రంగా కడగక పోతే ఎలాగండీ? ఎవరికైనా బయట తిళ్ళు తింటే ఫుడ్ పాయిజనింగ్ అవటం చూస్తాము. కానీ ఇంటి భోజనం తిని ప్రాణాల మీదకి తెచ్చుకున్న వాళ్ళని మిమ్మల్నే చూస్తున్నాను" అన్నారు మం దలింపు ధోరణిలో.

వర్ధనమ్మ గారు తప్పు చేసిందానిలా తల వంచుకున్నారు. ఆవిడ లోపల లోపల కమలమ్మగారి మీద కోపంతో కుతకుతలాడిపోయారు. ఎప్పుడు ఇంటికి వెళ్దామా ఎప్పుడు ఆవిడని పనిలోంచి తీసేద్దామా అని ఆరాటపడసాగింది.

ప్రభాకర్ అడిగారు డాక్టర్‌ని "వీళ్ళని ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తారండీ." డాక్టర్ చిరాకుగా చూసాడు. "చేరి ఆరు గంటలు కూడా కాలేదు. అప్పుడే డిశ్చార్జ్ అంటా రేంటండీ? ఒక ట్వంటీ ఫోర్ అవర్స్ అయితేనే కానీ చెప్పలేమండి."

"డయట్ ఏమివ్వమంటారండీ" ఈ సారి శరత్ అడిగాడు భయపడుతూనే.

"ప్రస్తుతం ఏమీ అక్కరలేదు. సెల యిన్ ఎక్కిస్తున్నాము కదా. రేపటి నుంచీ లయిట్‌గా మజ్జిగన్నం పెట్టవచ్చు." అనేసి డాక్టర్ వెళ్ళిపోయాడు.

కాస్సేపు అక్కడే ఉండి జనార్ధనరావు దంపతులకి ధైర్యం చెప్పారు శాంత. ప్రభాకర్. వచ్చేటప్పుడు శరత్‌కి చెప్పింది శాంత - "నువ్వు మా ఇంటికే వచ్చెయ్యి భోజనానికి. ఏమీ మొహమాటపడవద్దు. అమ్మా నాన్నకి అన్నం కూడా నేనే పంపిస్తాను" అని వర్ధనమ్మ గారి వైపు తిరిగి అంది శాంత.

"ఏమండీ పిన్నిగారూ మీకేమయినా అభ్యంతరమా సుజాత చేస్తే? ఉంటే చెప్పండి. వంట నేనే చేస్తాను."

వర్ధనమ్మ గారు స్వరంలో అపరాధ భావం ధ్వనిస్తుండగా ఇలా అన్నారు. "చచ్చిన పాముని ఇంకా ఎందుకమ్మా చంపుతావు. వంట ఎంత శుభ్రంగా చేసా రనేది ముఖ్యం కానీ ఎవరు చేసారనేది ముఖ్యం కాదని గ్రహించానమ్మా. కులం గోత్రం అన్నీ చూసి పెట్టుకున్న కమలమ్మ గారు ఎంత ఉద్ధరించిందో చూసాను కదా. సుజాత చేతి వంట తింటూ మీరెంత ఆరోగ్యంగా ఉన్నారో కూడా చూస్తున్నాను. భగవంతుడు నా కళ్ళు తెరిపించటానికే ఇలా చేసాడేమోననిపిస్తున్నది."

"అవునండీ. పరిశుభ్రత ముఖ్యం గానీ ఏ కులమయితే ఏముందండీ... ఈ తారతమ్యాలన్నీ మనిషి కల్పించుకున్నవే. విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజులలో కూడా మనం కులగోత్రాలకి ప్రాధాన్యతనివ్వడం శోచనీయం. అందరి లోనూ ప్రవహించేది ఒక రక్తమే కదా. భగవంతుడు అందరినీ సమంగానే సృష్టించాడు. అది మీరు ఇప్పటికయినా గ్రహించి నందుకు చాలా సంతోషం పిన్నిగారూ" చిన్న సైజ్ లెక్చర్ ఇచ్చింది శాంత. వర్ధనమ్మ గారు చిరునవ్వుతో చూశారు. ఇంతలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లు శరత్‌ని పిలిచి ఇలా అన్నారు.

"శరత్ కమలమ్మ గారికి జీతం లెఖ్ఖ చూసి ఇచ్చేసి ఆవిడకి ఉద్వాసన చెప్పు బాబూ".

శరత్ నవ్వాడు. "ఇంకా ఎక్కడి కమ లమ్మ గారమ్మా మీరు ఇటు హాస్పిటల్‌కి రావటం ఆవిడ అటు పలాయనం చిత్త గించటం ఒకేసారి జరిగాయి."

శరత్ నవ్వులో తానూ శృతి కలిపింది శాంత.

✸